Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

ప్రచురణ : తిరుపతి   సంపుటి : 02   సంచిక : 96   అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు   ఆదివారం 5 ఏప్రిల్ 2026   పేజీలు : 4   వెల : 3

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్ : 9440815774



## మైనారిటీలపై దాడి చేస్తున్న వారితో కేరళ సీఎం విజయన్‌కు సంబంధాలు

- కేరళలోని అలప్పుజలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం
- ఈ క్రమంలో అధికార ఎల్‌డీఎఫ్, బీజేపీపై తీవ్ర విమర్శలు
- ఈ రెండు పార్టీల మధ్య అవగాహన ఉందని ఆరోపణలు



### జీవితంలో ఓటమి సహజం

## ఆత్మహత్యలు పరిష్కారం కాదు

- యువతకు నారా లోకేశ్ దిశానిర్దేశం
- కర్ణాటకలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన
- ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రజలు
- కేంద్ర మంత్రులతో కలిసి సింధనూరులో భారీ బైక్ ర్యాలీ
- ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

### ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అమరావతి పనులు

# పూర్తికావాల్సిందే

- రాజధాని పనులు.. ఇక పరుగులు పెట్టాలి
- లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాల్సిందే
- నిర్మాణ సంస్థలు కడుతోంది కేవలం బిల్డింగులు కాదు... రాజధాని
- అమరావతి రాజధాని పనులపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని.. ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని... చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం - మిగతా3లో



## ఇరాన్‌తో చెల్లింపు సమస్యలేవీ లేవు

- కొన్ని నెలలకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి
- గుజరాత్ నుంచి చైనాకు ఇరాన్ చమురు నౌక డైవర్ట్
- ఈ ప్రచారం శుద్ధ అబద్ధమని భారత్ స్పష్టీకరణ
- చమురు నౌకల గమ్యస్థానాల్లో మార్పులు సర్వసాధారణమని వెల్లడి

## కేరళలో వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే

- ఎల్‌డీఎఫ్‌కు ఇప్పటికే కౌంట్‌డౌన్ ప్రారంభమైంది
- కేరళలో ప్రధాని మోదీ ఎన్నికల ర్యాలీ
- ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటమిలపై విమర్శల జల్లు
- శబరి రైలు ప్రాజెక్టును ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆలస్యం చేయడంతో తిరువళ్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు



### భానుడి

# భగభగలు

- రేపటి నుంచి పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం
- ఏపీలో రోజురోజుకూ పెరుగుతున్నఎండల తీవ్రత
- రేపు రాష్ట్రవ్యాప్తంగా 17 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రేపు రాష్ట్రవ్యాప్తంగా 17 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మరో 32 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. రేపు పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే - మిగతా3లో



## పుదుచ్చేరికి రాష్ట్ర హోదా

- పేదలకు ఉచిత విద్యుత్.. విజయ్ హామీల వెల్లువ
- కాంగ్రెస్, బీజేపీలు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించలేదు
- దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచిత విద్యుత్
- ప్రతీ కుటుంబానికి 25లక్షల వైద్య బీమా
- పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విజయ్

### విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, టెక్నాలజీకి

## అనుగుణంగా స్కిల్స్

- 'అమరావతి ఏఐ సమ్మిట్'
- కృత్రిమమేధపై అవగాహన పెంచేందుకు అమరావతి ఏఐ సమ్మిట్
- అమరావతి రీజియన్‌లో జరుగుతున్న అతిపెద్ద ఏఐ సమ్మిట్‌గా వెల్లడించిన నిర్వాహకులు
- విద్యార్థులకు కెరీర్ పట్ల స్పష్టత, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడంపై దిశానిర్దేశం




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కృత్రిమ మేధపై విద్యార్థులు, అధ్యాపకులు, వ్యాపారవేత్తల సందేహాలను తొలగించి వారికి దిశానిర్దేశం చేసేందుకు ఏపీ ప్రభుత్వం, ఎస్.టి.పి.ఐ. (సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా)ల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా ఏఐ సమ్మిట్?ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్రతో పాటుగా 30 మంది ప్రముఖ గ్లోబల్ ఏఐ నిపుణులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - మిగతా3లో



## 'ధర్మదామ్'లో ఎన్నికల హీట్

- హ్యాట్రిక్‌పై సీఎం విజయన్ గురి
- ఈసారి కష్టపడాల్సిందేనా
- వామపక్షాల కంచుకోట ధర్మదామ్‌లో ఆసక్తికర పోరు
- ఎల్‌డీఎఫ్- యూడీఎఫ్ తోపాటు రేసులోకి బీజేపీ
- పోటీ తీవ్రమవుతున్న వేళ హ్యాట్రిక్‌పై పినరయి విజయన్ దృష్టి

2

# విధ్వంసమే

# జగన్‌కు తెలుసు!

- అమరావతిపై ఇంకా ఆయన విషం కక్కుతూనే ఉన్నారు
- 'మావిగన్' తెరపైకి తెచ్చి అభాసుపాలైన జగన్
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు చూస్తే జగన్ పాలన పూర్తిగా విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో దూసుకెళ్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వం బాధ్యత అని, గత వారం రోజులుగా 5 కోట్ల మంది ప్రజలు ఆనందోత్సవాలతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో పార్లమెంట్, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య - మిగతా3లో

### అమరావతికి చట్టబద్ధత లభించడంపై

## ప్రతిఇంటి ముందు కొవ్వొత్తులు వెలుగులు



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
ఆంధ్రరాష్ట్ర ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపుమేరకు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నూతనంగా ఏర్పడిన రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీకోట మండలంలోని అనేక గ్రామాలలో తమ తమ ఇంటి ముందర శనివారం రోజు సాయంత్రం 6:00 గంటల నుండి ఏడు గంటల మధ్య కొవ్వొత్తులు వెలిగించి ప్రజలు హర్షం వ్యక్తం చేసినారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగాయి

### వైసీపీ ఇన్చార్జి కృపా లక్ష్మి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
కూటమి ప్రభుత్వంలో లైంగిక దాడులు పెరిగాయి మహిళలకు భద్రత కరువైందని గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కృపా లక్ష్మి అన్నారు. శనివారం కార్వేటినగరం మండలం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద టీటీడీలో జరిగిన అన్యాయాలపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృపా లక్ష్మి మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్ వీఆర్ నాయుడు మహిళల పట్ల ప్రవర్తించిన తీరు అందరు తలదించుకునేలా చేశారు. టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు మహిళలతో రాసలీల నడిపిన బిఆర్ నాయుడు పై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని మహిళలకు భద్రత కరువైంది టీటీడీ చైర్మన్ పదవికి బిఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైసిపి ఇన్చార్జి కృపా లక్ష్మి డిమాండ్ చేశారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి ఎస్ ఆర్ పురం మండల అధ్యక్షుడు మణి పెనుమూరు మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,, సాఫ్ట్వేర్ రవి,హరి ప్రసాద్ రెడ్డి ఎస్ఆర్ పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాము, సతీష్ భూపతి రెడ్డి అమృతరాజ్ సాఫ్ట్వేర్ ఆనంద్, ఏకాంబరం మహేష్, చందు రాజు గోవింద్ ఆరు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వి.కోట ఎన్టీఆర్ సర్కిల్లో చలివేంద్రం.



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 04:**
వి.కోటమండలం,రోజురోజుకు భారీగా పెరుగుతున్న భానుడి భగభగలు.. సామాన్యులకు త్రాగునీటిని అందుబాటు లోనికే తీసుకురావాలన్న ఒక మంచి సంకల్పంతో.. వి.కోట పట్టణం దిగు చెక్ పోస్ట్ లోని ఎన్టీఆర్ సర్కిల్ లో శనివారం రోజు మండల తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు, ప్రభుత్వఅధికారులు కలసి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడమై నది. ఈ సందర్భంగా అధికారులు, పార్టీ నాయకులు మాట్లాడుతూ.. వేసవి కాలం లో త్రాగు నీరు అనేది చాలా ముఖ్యం కావున ప్రతి కూడలిగా త్రాగనీరులు అందుబాటులోనికి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉన్నందువలన శనివారం రోజు చలివేంద్రాలను ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. వైద్యశాఖ వారు మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బకు దూరంగా ఉండాలని సాధ్యమైనంత వరకు ఈ వేసవిలో నీడ ప్రాంతములో ప్రజలు ఉండాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కుటుంబ సభ్యులతో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.
తిరుమల పవిత్రతను కాపాడాలని,

### మండల పరిషత్ అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో

## శ్రీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**సూళ్లూరుపేట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**



తిరుపతిజిల్లా సూళ్లూరుపేట నియోజక వర్గం సూళ్లూరుపేటలో శనివారం రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సూళ్లూరుపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు అల్లూరు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమల పవిత్రతను కాపాడాలని, బిఆర్ నాయుడు టిటిడి బోర్డ్ చైర్మన్‌గా కొనసాగే అర్హత తనకు లేదని, వెంటనే తొలగించాలని సూళ్లూరుపేట పార్క్ స్ట్రీట్‌లో గల శ్రీవెంక టేశ్వర స్వామి దేవస్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీశ్రేణులు పూజా కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంచిబుద్ధి ప్రసాదించాలని శ్రీవెంకటేశ్వర స్వామి వేడుకున్నారు. తిరుమల ప్రతిష్టతను దెబ్బతీసే విధంగా బిఆర్ నాయుడు వ్యవహార శైలి ఉందని, అటువంటి వ్యక్తిని వెంటనే చైర్మన్ పదవి నుండి తొలగించి తిరుమల పవిత్రతను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట మండలంలోని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్థిక విధ్వంసం నుంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా సాగుతున్న కూటమి

### మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం.. ఇంటికో మహిళా పారాశ్రామిక వేత్తను చేయడమే ప్రభుత్వ లక్ష్యం








**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
ఆర్థిక విధ్వంసం నుంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం సాగుతున్నదని పలమనేరు శాసన సభ్యులు అమంనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో గల బయప్పగారి పల్లి సింగిల్ విండో కార్యాలయం ఆధ్వర్యంలో నూతన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి రైతులకు యూరియా బస్తాలను ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పంపిణి చేశారు. అనంతరం పలమనేరు ఎంపీడివో కార్యాలయం వద్ద నున్న వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు 80 మందికి ఈ – సైకిళ్లను ఆయన పంపిణి చేపట్టి, స్వచ్ఛ రథన్ని ప్రారంభించారు. అదే విధంగా 499 స్వయం సహాయక సంఘాలకు రూ. 35 కోట్ల 39 లక్షల 59 వేల బ్యాంకు లింకేజీ, శ్రీనిధిరుణాలను ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంగించారు. ఎన్టీ రామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో (ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్)వారికి అవ కాశాలు ఇచ్చి రాజకీయంగా ఎదిగేలా పునాది వేశారన్నారు. రాబోయే2029 ఎన్నికల నాటికి చట్టసభల్లో (అసెంబ్లీ, పార్లమెంట్) మహిళలకు కూడా తగిన స్థానం లభించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, సుంక్షితమైనతాగు నీరు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సూచించారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఆగిపోయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం మరియు అమరావతిని రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. సుమారు 2,700 కోట్లతో చిత్తూరు జిల్లాలోని పడమటి నియోజకవర్గాలకు(కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, తంబళ్లపల్లె)గండికోట రిర్వాయర్ నుండి పైపుల ద్వారా ఇంటిం టికీ తాగునీరు అందించే పథకాన్ని రెండే ళ్లలో పూర్తి చేస్తారన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారాన్ని తగ్గించామని మహిళల ఆరోగ్యం కోసం గతంలో చంద్ర బాబు ప్రవేశపెట్టిన 'దీపం'పథకాన్ని కొనసాగిస్తూ, ఇప్పుడు సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా, ప్రతిబిడ్డకు ఈ పథకంకింద ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బ్యాంకుల ద్వారా లక్షలకోట్ల రూపాయల రుణాలను (తాకట్టు లేకుండా) అందిస్తున్నారన్నారు. ఈ–సైకిల్స్ : మహిళల కోసం రాయితీపై (సుమారు ?10,000 సబ్సిడీ) ఈ–సైకిళ్లను పంపిణీ చేస్తున్నా మని ఇది పర్యావరణానికి మేలు చేయ డమే కాకుండా, ఇంట్లోని పిల్లలు లేదా పెద్దలు కూడా వాడుకోవడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆరోగ్యం మరియు గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, సింగిల్ విండో చైర్మన్లు పెద్దబ్బ, వెంకట ముని రెడ్డి, టిడిపి నాయకులు నాగరాజు రెడ్డి, గణేష్, జగదీష్ నాయుడు, సెల్వరాజ్, రామూర్తి నాయుడు, గిరి, కవీంద్ర నాయుడు, అనిల్ మరియు పలమనేరు గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, ఎంపీడీవో కార్యాలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

### ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం అని స్పష్టం

**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని జడ్పి ఉన్నత పాఠశాలలో శనివారం పలమనేర్ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి మధ్యాహ్నం భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా భోజనం నాణ్యతతో పాటు పాఠశాలలో ఏదైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు విద్యార్థుల హాజరు శాతాన్ని సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అన్ని సక్రమంగా అమలు జరుగుతున్నట్లు గుర్తించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన భోజనంతో పాటు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నూతన సంస్కరణలతో విద్యా ప్రమాణాలలో మార్పులు తీసుకొచ్చి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయనున్నామని స్పష్టం చేశారు. ఇందుకోసం పాఠశాలల తనిఖీతో పాటు సౌకర్యాల ఏర్పాటుకు చేపట్టాల్సిన అంశాలను గుర్తించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్నతో పాటు పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయులు ఉన్నారు.





# ఆత్మహత్యగా మలిచిన హత్య కేసు బట్టబయలు

## భార్య, ప్రియుడు అరెస్ట్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
కుప్పం మండలం మోట్లచేను గ్రామంలో సంచలనం సృష్టించిన అనుమానాస్పద మృతి కేసు హత్యగా తెలియ వచ్చిందని కుప్పం పట్టణ సిఐ శంకరయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వాటి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మోట్లచేను గ్రామానికి చెందిన భూపతి (38) ఈ నెల 24న బిక్కలగట్టు సమీపంలోని మామిడితోటలో చెట్టుకు వేలాడుతూ మృతి చెందిన ఘటనపై అతని తల్లి పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు మొదట ఉరివేసుకుని మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మృతిపై అనుమానాలు వ్యక్తమవడంతో పోలీసులు లోతుగా విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో భూపతిని అతని భార్య గీత (36), ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన తిమ్మన్ పొన్నుకన్ అలియాస్ మసితిమ్మన్ (41) కలిసి ఈ నెల 22న హత్య చేసినట్లు తెలిసిందన్నారు. అనంతరం మృతదేహాన్ని గ్రామ సమీపంలోని మామిడిచెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు శనివారం మోట్లచేను పంచాయితీ కార్యదర్శి సమక్షంలో ఇద్దరినీ అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించడంతో పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసును హత్య కేసుగా మార్చినట్టు తెలిపారు. తదనంతరం కుప్పం అర్బన్ ఇన్స్పెక్టర్ నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానానికి హాజరు పరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

## దళిత కుటుంబంపై అర్ధరాత్రి దాడి – ఉద్రిక్తత






**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 04 :**
చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం నంజంపేట గ్రామంలో దళిత కుటుం బంపై అగ్రవర్ణాల వ్యక్తులు అర్ధరాత్రి దాడి చేసిన ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామానికి చెందిన చిన్నపిల్లల గొడవను కారణంగా చూపుతూ, అదే గ్రామానికి చెందిన కొందరు అగ్రకులానికి చెందిన వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి సమ యంలో దాడికి పాల్పడ్డారని బాధితులు తెలిపారు. ఉమాశంకర్, గిరిప్రసాద్, బాలాజీ ఆచారి, ప్రకాష్ నాయు డు, సూరప్ప నాయుడు, శ్రీరామ్, ప్రవీణ్, యశ్వంత్ తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 50 మంది గుంపుగా చేరి రాత్రి 11 గంటల సమయంలో నిద్రిస్తున్న మునెప్ప ఇంటిపై దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో మహిళలు, బాలింతలు ఉన్నా వారిపై ఎలాంటి కనికరం చూపకుండా విచక్షణారహితంగా దాడి చేసినట్టు బాధితులు ఆరో పించారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడి ఘటనపై వెంటనే చర్యలు తీసుకుని నిందితులను అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు స్పందించి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రా యపడుతున్నారు

## తిరుమల పవిత్రతను కాపాడండి మాజీ ఎమ్మెల్యే వెంకయ్య గౌడ



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
తిరుమల పవిత్రతని కాపాడాలని తిరుమల పవిత్రతను భంగం కలిగిస్తున్న బిఆర్ నాయుడుని చైర్మన్ పదవి నుండి వెంటనే తొలగించాలని మాజీ ఎమ్మెల్యే వెంకటె గౌడ డిమాండ్ చేస్తూ పలమనేరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్త లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా శ్రీరామనవమి కళ్యాణోత్సవం కార్యక్రమం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
వెదురుకుప్పంమండలం గంటవారిపల్లి పంచాయతీ మునిరెడ్డిగారి ఊరు గ్రామంలో శ్రీరాముని గుడి ధర్మకర్త పులికంటీ బాబురెడ్డి, బిల్డర్ జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం టిడిపిమండల అధ్యక్షులు మోహన మురళి, పార్లమెంట్ కార్యనిర్వా హక కార్యదర్శి చంగల్రాయిరెడ్డి, ఏటీఎం పరుశురామ రెడ్డి,సింగల్ విండో డైరెక్టర్ మనోహర్ నాయుడు,మాజీ ఎంపీటీసీ మాధవ నాయుడు,బూత్ కన్వీనర్ వెంకటరెడ్డి,టిడిపి నాయకులు యువకుమార్ రెడ్డి, వెంకటేష్, విక్కీ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
మారేపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏప్రిల్ 14న నూతన అంబేద్కర్ విగ్రహాఆవిష్కరణ కార్యక్రమా న్ని వైభవంగా నిర్వహిస్తారు. వైసీపీ సమ న్వయకర్త కృపాలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని గ్రామయువత, గ్రామస్తులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. శనివారం ఆమెను కలిసి ఆహ్వానపత్రిక అందజేశా రు. గ్రామప్రతినిధులు మాట్లాడుతూ... అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని,కృపాలక్ష్మి విగ్ర హాన్ని ఆవిష్కరించాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించి, కార్యక్రమంలో పాల్గొంటానని హామీ ఇచ్చింది. ఈ కార్యక్ర మంలో మారేపల్లి గ్రామ యువకులు, బాధ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విధ్వంసమే జగన్‌కు తెలుసు!

-మొదటిపేజీ తరువాయి

రామమందిరం, ఇఅఅ, వక్ఫ్ బిల్లు సవరణ, మతమార్పిడి వ్యతిరేక చట్టాలు వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు వచ్చినా ఎక్కడా ఏకాభిప్రాయం రాలేదని అన్నారు. అయితే అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలపగా కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి పార్లమెంట్‌లో వాకౌట్ చేసిందని విమర్శించారు. తెలుగు జాతి రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న కక్ష చరిత్ర చూస్తే అర్థమవుతుందని, చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా 5 కోట్ల మంది ఆంధ్రుల అభివద్ధినే దష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం జరగకుండా చివరి నిమిషం వరకు పోరాడిన నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేసి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాంతాలు, వర్గాల మధ్య విభేదాలు రాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, హైదరాబాద్‌లో 13 గంటల పాటు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి అందరి అభిప్రాయంతోనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. ఆ సమయంలో వైసీపీ కూడా అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపిందని, "ఇక్కడే ఇల్లు కట్టుకుంటాను, రాజధానిని మార్చను" అన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చి అమరావతిని శ్మశానం, ఎడారి అంటూ దూషించారని, ఒక జాతి, కులంపై నీచ వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. అమరావతిలో అవినీతి జరిగిందని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, రాజధాని విషయంలో తొమ్మిది సార్లు మాట మార్చారని విమర్శించారు. ప్రజల ఆనందాన్ని చెడగొట్టేందుకు "మావిగన్" అనే కొత్త నాటకంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, జగన్‌కు వైసీపీలోనే మద్దతు లేదని, ప్రజలు ప్రశ్నిస్తే రాజకీయాల్లో ఉండలేరని హెచ్చరించారు. అమరావతి తెలుగు ప్రజల భవిష్యత్తు అని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి అన్ని ప్రాంతాలను సమానంగా అభివద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.



# జీవితంలో ఓటమి సహజం
# ఆత్మహత్యలు పరిష్కారం కాదు

"ఎన్నికలకు ముందు ఏ తప్పూ చేయని మా పెద్దాయన (చంద్రబాబు)ను అక్రమంగా జైలులో పెట్టారు. ఏ తప్పూ చేయకుండా జైలులో పెట్టినందుకు నేను తీవ్రంగా బాధపడ్డాను. కానీ, ఆ క్లిష్ట సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలంతా మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. నాడు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్వేగంగా అన్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తన తండ్రి అరెస్టు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమాజంలో నైతిక విలువల ఆవశ్యకత గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**కర్ణాటకలో ఘన స్వాగతం**

మంత్రి నారా లోకేశ్ ఉదయం కర్ణాటకలోని సింధనూరుకు చేరుకున్నారు. స్థానిక తెలుగు యువత ఆయనకు ఘన స్వాగతం పలికింది. భారీ గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. యువగళం జెండాలు చేతబూని 'జై లోకేశ్' అంటూ నినాదాలు చేశారు. సింధనూరులోని ఎంజీ సర్కిల్ నుంచి గంగావతి రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు హెచ్.డీ కుమారస్వామి, సంజయ్ సేథ్ పాల్గొన్నారు. ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీలో ప్రజలందరికీ అభివాదం చేస్తూ లోకేశ్, కేంద్ర మంత్రులు ముందుకు సాగారు.

**ఎన్టీఆర్ విగ్రహం, సైనిక్ స్కూల్ ఆవిష్కరణ**

ర్యాలీ అనంతరం హోస్లళ్లీ క్యాంప్ గంగావతి రోడ్డులోని కమ్మవారి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రులతో కలిసి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం హోస్లళ్లీ క్యాంప్‌లో నూతనంగా నిర్మించిన 'శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్'ను ప్రారంభించారు. సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని కూడా ప్రారంభించారు. స్థానిక తెలుగు వారి యాజమాన్యంలోని విద్యా సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఈ సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయడం విశేషం.

**నాడు నా భార్య బ్రాహ్మణి అడిగిన ప్రశ్న**

చంద్రబాబు అరెస్టు నాటి కష్టకాలాన్ని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్ణాటక తెలుగు ప్రజానీకం పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారని ఆయన గుర్తు చేశారు. వారి రుణం తీర్చుకునేందుకే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. "పెద్దాయనను జైలులో పెట్టగానే, మనకు ఈ రాజకీయాలు అవసరమా? అని నా భార్య బ్రాహ్మణి నన్ను అడిగింది" అని లోకేశ్ చెప్పారు. "అందుకు తాను ఒకటే సమాధానం చెప్పానన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగోళ్లంతా మనకు అండగా నిలబడ్డారని బదులిచ్చానని" ఆయన వివరించారు. తెలుగు ప్రజలు ఎక్కడున్నా, వారికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని లోకేశ్ భరోసా ఇచ్చారు.

**ఆ పదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలి**

సమాజంలో నైతిక విలువలు బాగా పడిపోతున్నాయని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువల కోసమే ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారునిగా నియమించుకున్నామని చెప్పారు. తెలుగు వాడుక భాషలో మహిళలను అవమానించేలా కొన్ని పదాలు వాడుతున్నామన్నారు. 'గాజులు తొడుక్కున్నావా?', 'అమ్మాయిలా ఏడవొద్దు' వంటి పదాలను ఇకపై ఎవరూ వాడొద్దన్నారు. ఇలాంటి కించపరిచే పదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

**'తల్లికి చెప్పలేని పని చేయొద్దు'**

తాను ఎప్పుడూ చాగంటి మాటలను అనుసరిస్తానని లోకేశ్ చెప్పారు. "తల్లికి చెప్పలేని ఏ పనీ మనం చేయొద్దు" అని ఆయన సూచించారు. మనం ఏ నిర్ణయం తీసుకున్నా, అది మన తల్లికి చెప్పగలమా లేదా అని ముందుగా ఆలోచించాలన్నారు. నేటి సమాజంలో పిల్లలు చాలా సున్నితంగా మారిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఒక్క పరీక్షలో ఫెయిల్ అయితేనే, ఆత్మహత్య చేసుకునే పరిస్థితి చూస్తున్నామన్నారు. జీవితంలో ఓటమి సహజమని, దాని ద్వారానే ఎన్నో గుణపాఠాలు నేర్చుకోవాలని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని యువతకు లోకేశ్ దిశానిర్దేశం చేశారు.



# హిందుత్వ ముద్ర కోసం భూమన ఆరాటం

**తిరుపతి :** ఆధ్యాత్మిక నగరి తిరుపతి రాజకీయాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. అయితే, గత కొంతకాలంగా వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తనపై ఉన్న 'హిందూ వ్యతిరేకి' ముద్రను చెరిపేసుకునేందుకు భూమన వేస్తున్న అడుగులు, తాజాగా జరిగిన ఒక ముస్లిం దంపతుల మత మార్పిడి ఉదంతం రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. తిరుపతికి చెందిన యాలమూరి శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులు ఉపాధి కోసం సుమారు 27 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ ఉన్న కాలంలో వారు ఇస్లాం మతాన్ని స్వీకరించి, తమ పేర్లను అబ్దుల్లా, అమీనాగా మార్చుకున్నారు. అన్ని అధికారిక పత్రాల్లోనూ అవే పేర్లతో కొనసాగారు. 2015లో భారతదేశానికి తిరిగి వచ్చిన వీరు తిరుపతిలోని పెద్దకాపు వీధిలో నివాసం ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న భూమన కరుణాకర్ రెడ్డి, స్వయంగా వారి ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. హిందూ ధర్మం విశిష్టతను వారికి వివరించి, తిరిగి స్వధర్మానికి రావాలని ప్రేరేపించారు. ఫలితంగా, భూమన నివాసంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆ దంపతులు తిరిగి హిందూ మతాన్ని స్వీకరించారు. అబ్దుల్లా మళ్ళీ శ్రీనివాస్‌రెడ్డిగా, అమీనా పుష్పగా తమ మూలాల్లోకి వచ్చారు. వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన భూమనపై ప్రత్యర్థులు మొదటి నుంచీ ఒకే రకమైన దాడి చేస్తున్నారు. ఆయన నాస్తికుడని, దేవుడిని నమ్మరని, లోలోపల క్రైస్తవ మతాన్ని ప్రోత్సహిస్తారని రాజకీయ విమర్శలు నిత్యం వినిపిస్తుంటాయి. ముఖ్యంగా టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి తీసుకురావడం ద్వారా తనపై ఉన్న వ్యతిరేక ప్రచారానికి భూమన గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరుమల ఆస్థాన మండపంలో 90 మంది పీఠాధిపతులు, మఠాధిపతులతో నిర్వహించిన వేద విద్వత్ సదస్సులో ఒక తీర్మానం చేశారు. ఇతర మతాల నుంచి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి తిరుమల శ్రీవారి సన్నిధినే వేదికగా చేయాలని, శ్రీవారే వారికి దిక్సూచి కావాలని ఆయన సంకల్పించారు. అయితే, ఈ లోపే ప్రభుత్వం మారిపోవడం, తదుపరి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు వ్యక్తిగత స్థాయిలో ఆయన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదంలో అప్పటి టీటీడీ బోర్డు పైనా, వైసీపీ ప్రభుత్వం పైనా హిందూ సమాజంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సరిగ్గా ఇలాంటి క్లిష్ట సమయంలో భూమన ఇలాంటి మత పునఃస్వీకరణ కార్యక్రమాలు చేపట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీపై పడిన 'హిందూ వ్యతిరేక' ముద్రను తొలగించుకోవడానికి భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది ప్రశ్నార్థకమే. మత మార్పిడి చేసుకున్న దంపతులు భూమన కృషిని కొనియాడుతున్నప్పటికీ.. సాధారణ భక్తులు, రాజకీయ ప్రత్యర్థులు దీనిని కేవలం డ్యామేజ్ కంట్రోల్ చర్యగానే చూస్తున్నారు.




## ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అమరావతి పనులు పూర్తికావాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలవైన పనులు ఉండగా... వాటిల్లో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్ పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దష్టికి తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా... ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను... నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే... వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి... ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు... ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే.. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది... ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. కష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని.. జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నా... ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భానుడి భగభగలు

-మొదటిపేజీ తరువాయి

అవకాశం: ఇక ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస, బూర్జ, హిరమండలం, జలుమూరు, లక్ష్మీనర్సుపేట, పాతపట్నం, సారవకోట, సరుబుజ్జిలి మండలాలు, విజయనగరం జిల్లా గుర్ల, సంతకవిటి మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, సీతంపేట మండలాలు, పోలవరం జిల్లా గంగవరం, కూనవరం మండలాలు, తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ఉత్తరాంధ్రలో మూడురోజులపాటు అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలుకురిసే అవకాశం ఉందని తెలిపారు. భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన:**

దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనము విస్తరించి ఉందని విపత్తు నిర్వహణ సంస్థ అధఇకారులు తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా గూడూరులో 41.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.1 డిగ్రీలు, కృష్ణా జిల్లా పెద్దపారుపూడిలో 40.9 డిగ్రీలు, చిత్తూరు జిల్లా నగరిలో 40.4 డిగ్రీలు,మన్యం జిల్లా వీరఘట్టంలో 40.3 డిగ్రీలు, విజయనగరం జిల్లా గుర్లలో 40.1 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. వడగాలులు వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్ధులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్

-మొదటిపేజీ తరువాయి

ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా టెక్నాలజీలో మన తెలుగు వారు ఉంటారని తెలియజేశారు. ప్రభుత్వం ప్రొత్సాహంతో రాష్ట్రానికి టెక్నికల్ హబ్?గా మార్చేందుకు ప్రణాళికలు రుపొందించడం జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టెక్నాలజీకి అమలుకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తారని మంత్రి తెలిపారు. దాదాపు 25 యేళ్ల క్రితమే సీఎం చంద్రబాబు టెక్నాలజీ గురించి మట్లాడారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

**ఏఐపై అవగాహన పెంచేందుకే:**

ఏఐ సహాయంతో పది మంది చేసే పనిని ఒక్కరే చేయగలరని ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు అన్నారు. ఏఐ ద్వారా రాబోయే సవాళ్లను ఎదుర్కొవాడనికి ముందుగానే మనం సిద్ధంగా ఉండాలని ఆయన గుర్తు చేశారు. సీఎస్ఈ గ్రాడ్యుయ్యేట్?లు కేవలం ప్రోగ్రామింగ్ స్టాఫ్?వేర్?ను నేర్చుకోవడం కాకుండా డిజైన్ సిస్టమ్?తో పాటు డొమైన్ నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలన్నారు. విద్యార్థులు ఏఐలో మరింత పరిణితిని సాధించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఏఐతో పోటీ తప్పని పరిస్థితిగా మారిందని వివరించారు. విద్యార్థుల్లో ఏఐపై అవగాహన పెంచేందుకు ఈ సమ్మిట్?ను నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు వెల్లడించారు. హాజరైన 30 మంది గ్లోబల్ ఏఐ నిపుణులు: ఈ సమ్మిట్?లో సాంకేతిక రంగానికి సంబంధించి సంస్థలు నుంచి 30 మంది గ్లోబల్ ఏఐ నిపుణులు పాల్గొన్నారు. సాంకేతికతకు సంబంధించి పలు సెషన్స్ నిర్వహించి ఏఐపై విద్యార్థులకు నిపుణుల సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే ఏఐపై సమ్మిట్?లో లేవనెత్తిన ప్రశ్నలకు నిపుణులు సమాధానాలను ఇచ్చారు. ఈ సదస్సుకు నగరంలోని పలు యూనివర్సిటీలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఏఐతో భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు లభిస్తాయి, ఈ రంగం వైపు వెళితే కలిగే ప్రయోజనాల గురించి నిపుణులు విద్యార్థులకు వివరించారు. ప్రతి అయిదేళ్లకోసారి టెక్నాలజీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని ఏఐ సమ్మిట్?కు హాజరైన విద్యార్థులు అన్నారు. ఇప్పటి వరకు సాఫ్ట్?వేర్ రంగమే అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ఏఐ వచ్చిన తర్వాత ఉద్యోగాలు కొల్పోతున్నారనే వార్తలు వింటున్నామని అన్నారు. అయితే ఏఐ ద్వారా ఉద్యోగాల కల్పన జరుగుతుందనే ఎవరూ చెప్పడం లేదన్నారు. ఈ సమ్మిట్?లో ఏఐ ద్వారా వచ్చే నష్టాలతో పాటు, ఉద్యోగల కల్పన గురించి కూడా తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. టెక్నాలజీ రంగంలో ఏఐ విప్లవాత్మకమైందని విద్యార్థులంతా భావించారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
మారేపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏప్రిల్ 14న నూతన అంబేద్కర్ విగ్రహఆవిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. వైసీపీ సమ న్వయకర్త కృపాలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేయాలని గ్రామయువత, గ్రామస్తులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. శనివారం ఆమెను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. గ్రామప్రతినిధులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, కృపాలక్ష్మి విగ్ర హాన్ని ఆవిష్కరించాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించి, కార్యక్రమంలో పాల్గొంటానని హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలోమారేపల్లిగ్రామయువకులు,బాధ్యులు,స్థానికనాయకులు పాల్గొన్నారు.

# బూత్ కమిటీలే వైఎస్ఆర్‌సీపీకి వెన్నెముక మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
పలమనేరుపట్టణంలోని విటిఎస్ కళ్యాణ మండపంలో పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటేగౌడ నాయకత్వంలో "నియోజకవర్గ స్థాయి బూత్‌కమిటీ విస్తృతస్థాయి" సమావేశం నిర్వహించారు. వెంకటే గౌడ మాట్లాడుతూ, పలమ నేరు నియోజకవర్గంలో బూత్ కమిటీల ఏర్పాటుపై పార్టీ నాయకులతో సమావేశ మై, భవిష్యత్ కార్యచరణపై దిశానిర్దేశం చేసారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి,పార్టీ విజయానికి కృషి చేయాల ని కోరారు. పార్టీకోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని.. మీ కష్టాన్ని నేనే గుర్తిస్తాని భరోసానిచ్చారు. పలమనేరు నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని,ప్రతి కార్యకర్తను నా కుటుంబ సభ్యుడిగా భావిస్తానని..మీ కష్టంలో సుఖంలో నేను ఎప్పుడూ మీ వెంటే ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మనమందరం కలిసి పలమనేరు నియోజక వర్గంలో వైఎస్ ఆర్సీపీ జెండాను రెపరెపలాడిద్దామని, పార్టీని అంకితభావంతో నడిపించే సైని కులందరికీ నేనున్నానంటూ వెంకటే గౌడ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను కాపాడండి



**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 04:**
అన్నమయ్యజిల్లా పీలేరు తిరుమల దేవస్థానం పవిత్రతను కాపాడాలని టీటీడీ చైర్మన్ పదవి నుంచి బిఆర్ నాయుడును తొలగించాలని వైఎస్ఆర్ సిపి ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలవైసీపీ కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, టెలికామ్ బోర్డు సభ్యుడు కాగిత ఆనంద్, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మహితాఆనంద్, జాయింట్ సెక్రటరీ హరిత, ఎంపీ పీఆర్ఓ ఉదయ కుమార్, పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, గుర్రం సురేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ చిన్న యల్లాప్ప, జాయింట్ సెక్రటరీ సదాశివ, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ షాకీర్, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ కాలనీ చిన్న, ఎస్సీ సెల్ కన్వీనర్ సీకే వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు కాలనీ లోకనాథం, ఒంటిల్లు లోకనాథ్ రెడ్డి, మిలిటరీ సహదేవ రెడ్డి, గుర్రం మహేశ్వర్ రెడ్డి, గాయం భాస్కర్ రెడ్డి, విక్టరీ వెంకటరమణా రెడ్డి, కేతం సాంబశివారెడ్డి, షబ్బీర్, చెంగల్ రాయులు, ఎన్వీ చలపతి, కాకులారం భాస్కర్ రెడ్డి, గిరీష్ గౌడ్, మహిళా విభాగం నాయకులు అరుణ, లక్ష్మిదేవి, రాజ్యలక్ష్మి, సఫూర్, షహనాజ్, రాజేశ్వరి, నాగరాజమ్మ, మళ్ళీశ్వరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియాని పంపిణీ చేసిన

## శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**




పలమనేరు పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో గల బయప్పగారి పల్లి సింగిల్ విండో కార్యాలయం ఆధ్వర్యంలో నూతన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి రైతులకు యూరియా బస్తాలను ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పంపిణి చేశారు. అనంతరం పలమనేరు ఎంపీడివో కార్యాలయం వద్దనున్న వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు 80 మందికి ఈ – సైకిళ్లను ఆయన పంపిణి చేపట్టి, స్వచ్ఛ రథన్ని ప్రారంభించారు. అదేవి ధంగా 499 స్వయం సహాయక సంఘాలకు రూ. 35 కోట్ల 39 లక్షల 59 వేల బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలను ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంగించారు.

## ప్రబోధానంద స్వామి జయంతి వేడుకలకు

# బయలుదేరిన కుప్పం భక్తులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04 :**
త్రైత సిద్ధాంత గురువు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి జయంతి వేడుకల సందర్భంగా కుప్పం పట్టణం నుండి వందమంది భక్తులు శనివారం అనంతపురం జిల్లాకు బయలుదేరారు. ఈ విషయాన్ని కుప్పం ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్నపొడమల గ్రామంలోని ప్రబోధాశ్రమంలో ఆదివారం జరిగే జయంతి వేడుకలకు నాలుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు స్వామివారి సమాధి, శ్రీకృష్ణ ప్రతిమకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ఉదయం 9 గంటలకు మూడు మతాల దైవజ్ఞాన సమన్వయంపై ప్రత్యేక చర్చ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో శ్రీలంక నుండి వచ్చిన బౌద్ధ భిక్షువులు ఉపన్యాసం ఇవ్వనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి బోధలను వీడియో ద్వారా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. భక్తి విశ్వాసాలతో ఈ వేడుకల్లో పాల్గొనడానికి కుప్పం ప్రాంతం నుండి వందమంది భక్తులు సమిష్టిగా బయలుదేరడం ఆనందంగా ఉందన్నారు.

# ప్రజల సహకారంతో చిత్తూరు జీరో వేస్ట్ నగరం




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 04:**
స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగంగా శనివారం గాంధీ విగ్రహ కూడలి వద్ద జీరో వేస్ట్, తడి, పొడి వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, మనోహరం, ప్రతిజ్ఞా కార్యక్రమాలు జరిగాయి. ప్రజల భాగస్వామ్యంతోనే చిత్తూరు నగరాన్ని వ్యర్థరహితంగా మార్చుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. తడి, పొడి వ్యర్థాల వేరుపరచడంపై గ్రీన్, బ్లూ, రెడ్ డస్ట్ బిన్లతో అవగాహన కల్పించారు. ఈ రంగుల సూచనలను కాన్వాస్‌లపై ప్రదర్శించి వివరించారు. జీరో వేస్ట్‌పై రూపొందించిన రంగవల్లి ప్రేక్షకులను ఆకట్టుకుంది. పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి 'స్వచ్ఛత యాప్' డౌన్‌లోడ్ చేసుకొని వాడాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.పి.లోకేష్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, ప్రజలు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఇరాన్ ప్రకటనపై స్పందించిన డెల్.. ఉద్యోగులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ




ఇరాన్ ప్రభుత్వం తనను ఉగ్రవాద సంస్థ గా ప్రకటించడంపై అమెరికాకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ డెల్ స్పందించింది. తన ఉద్యోగుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ అంతర్గతంగా ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఉద్యోగులెవరూ ఇరాన్‌కు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఇరాన్ సంస్థలు లేదా ఆ దేశ వ్యక్తులతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కంపెనీ డేటా, నెట్‌వర్క్ భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని డెల్ తన ఐటీ విభాగాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా–ఇరాన్ ఘర్షణ ఇప్పుడు క్షిపణుల నుంచి గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్స్ సంస్థల వైపు మళ్లినట్టుగా కనిపిస్తోంది. అమెరికాకు చెందిన 18 ప్రముఖ కంపెనీలు తమ హిట్ లిస్టులో ఉన్నాయని ఐఆర్జీసీ తన టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పష్టంచేసింది. ఈ ఐటీ సంస్థలన్నీ అమెరికా నిఘా వర్గాలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయని ఆరోపించింది.

## మొన్న పెట్రోల్.. నేడు సీఎన్‌జీ: పెరిగిన ధరలు!




పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన తరువాత ప్రపంచంలోని చాలా దేశాల్లో ఇంధన ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఏర్పడింది. ఇలాంటి సమయంలో మన దేశంలోని టొరెంట్ గ్యాస్ సంస్థ జైపూర్‌లో కేజీ కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరను రూ.2.50 పెంచింది. దీంతో వినియోగదారులపై పెరుగుతున్న వ్యయ భారం మరింత పెరిగింది. ఇంధన ధరలలో విస్తృతమైన పెరుగుదల సవరణల మధ్య ఈ పెంపు చోటుచేసుకుంది, ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు కూడా పెరిగాయి. సీఎన్‌జీ ధరల పెంపుతో పాటు, చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రధాన నగరాల వ్యాప్తంగా వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను పెంచాయి. ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.195.50 పెరిగి రూ.2,078.50కి చేరింది. 5 కేజీల చిన్న సిలిండర్ల ధరలు కూడా రూ.51 మేర పెరిగింది. కోల్‌కతాలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ల ధరలు ఏకంగా రూ.218 మేర పెరిగాయి. మంత్రిత్వ శాఖ ప్రకారం.. ప్రపంచ మార్కెట్ పోకడల ఆధారంగా వాణిజ్య ఎల్‌పీజీ ధరలను నెలవారీగా సవరిస్తారు. తాజా ధరల పెంపునకు కారణం.. సౌదీ కాంట్రాక్ట్ ధరలో 44% భారీ పెరుగుదలే అని తెలుస్తోంది. ఈ ధర మార్చిలో మెట్రిక్ టన్నుకు 542 డాలర్ల నుంచి ఏప్రిల్‌లో మెట్రిక్ టన్నుకు 780 డాలర్లకు పెరిగింది. ఎల్‌పీజీ సరఫరా తగ్గిపోవడం కూడా సిలిండర్ ధరలు పెరగడానికి కారణం అవుతోంది.

# సంపాదకీయం

# భారత్ సరికొత్త అడుగు

కాలచక్రం ఎప్పుడూ ఒకేలా ఉండదు. చరిత్ర పుటలు తిరగేస్తే ఒకనాటి అద్భుత దృశ్యం కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో భారతదేశం ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయలా ఉండేది. క్రీస్తు పూర్వం ఒకటవ సహస్రాబ్దిలోనే మన పశ్చిమ తీరాల నుంచి నౌకలు పశ్చిమాసియా వైపు పయనించేవి. సింధు లోయ నాగరికత విరాజిల్లుతున్న సమయంలోనే లోథాల్ వంటి ఓడరేవులు మెసొపొటేమియా, ఈజిప్టుతో నిరంతర సంబంధాలు నెరిపేవి. బాబిలోనియన్లు తమ కట్టడాల కోసం భారతీయ టేకును వినియోగించేవారంటే మన ఎగుమతుల స్థాయి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రోమన్ సామ్రాజ్యపు సంపద మన సుగంధద్రవ్యాల కోసం, మస్లిన్ వస్త్రాల కోసం భారత్‌కు ప్రవహించేది. 18వ శతాబ్దం వరకు ప్రపంచ తయారీ రంగంలో మనమే అగ్రగామి. చోళులు సముద్రాలను శాసించారు. శాతవాహనులు రోమ్ దాకా వ్యాపారం విస్తరించారు. అదొక స్వర్ణయుగం. ఆ వైభవం మళ్లీ పునరావృతమయ్యే చారిత్రక సందర్భం ఇప్పుడు మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నది. ప్రస్తుతం ప్రపంచం ఒక వింతైన సంక్షోభంలో ఉన్నది. మధ్యప్రాచ్యంలో రగులుతున్న టెక్ యుద్ధం దీనికి నిదర్శనం. ఏప్రిల్ 1న బహ్రెయిన్‌లోని 'బాటెల్కో' టెలికాం సంస్థపై జరిగిన దాడులు కేవలం ఒక క్షిపణి సామాన్యమైనవి కావు. అవి గ్లోబల్ టెక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగిన దాడులు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి దిగ్గజాలు తమ కస్టమర్లను డాటా తరలించుకోమని హెచ్చరించడం ఒక తీవ్రమైన పరిణామం. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి 18 దిగ్గజ కంపెనీలను ఇరాన్ లక్ష్యంగా ప్రకటించడం ప్రపంచ పెట్టుబడిదారుల్లో గుబులు రేపుతున్నది. గత ఐదేండ్లుగా గల్ఫ్ దేశాలను టెక్ హబ్‌లుగా మార్చడానికి ఖర్చు చేసిన బిలియన్ల డాలర్లు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయి. ఈ అస్థిరత ప్రపంచ టెక్ మ్యాప్‌ను మార్చేస్తున్నది. పెట్టుబడికి ప్రాణం భద్రత. ఎక్కడైతే శాంతి ఉంటుందో అక్కడికే సంపద చేరుతుంది. మధ్యప్రాచ్యం అస్థిరంగా మారిన వేళ.. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తున్నది. భారతదేశం ఇప్పుడు ఒక 'టెక్ సేఫ్ జోన్' (౧వఎష్ట్ర ూఖటవ ్గశీఅవ)గా అవతరించింది. మన దేశంలో ఉన్న సైబర్ భద్రత చట్టాలు, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ యాక్ట్ వంటివి అంతర్జాతీయ కంపెనీలకు ఒక బలమైన భరోసాను ఇస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూర్ వంటి నగరాలు కేవలం ఐటీ సెంటర్లు మాత్రమే కాదు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన సురక్షిత దుర్గాలు. యుద్ధ మేఘాలు లేని ఆకాశం, స్థిరమైన ప్రభుత్వం మన దేశానికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. భారతదేశ భౌగోళిక స్థానం మనకు దేవుడిచ్చిన వరం. హిందూ మహాసముద్రం మధ్యలో ఉండటం వల్ల ప్రపంచ వాణిజ్య మార్గాలపై మనకు సహజసిద్ధమైన పట్టు లభిస్తున్నది. సుమారు 7,516 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం మనల్ని ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు వారధిగా నిలబెట్టింది. ఉత్తరాన హిమాలయాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయి. చైనా దూకుడును అడ్డుకోవడంలో భారత్ ఇప్పుడు ఒక 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మారింది. ఈ భౌగోళిక రాజకీయ ప్రాధాన్యత వల్లే అగ్రరాజ్యాలు మనతో జట్టు కట్టడానికి పోటీ పడుతున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్ పాత్ర ఇప్పుడు అనివార్యం. ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న మరో నినాదం 'చైనా ప్లస్ వన్' (జష్ట్రఱఅఝ ూశ్రీబం ూఅవ). గతంలో ప్రపంచమంతా చైనాపైనే ఆధారపడింది. కానీ వాణిజ్య యుద్ధాలు, కొవిడ్ సమయంలో వచ్చిన సరఫరా గొలుసుల అంతరాయం ప్రపంచం కండ్లు తెరిపించాయి. ఒకే దేశంపై ఆధారపడటం ఎంతటి ఆత్మహత్యాసదృశమో కంపెనీలు గుర్తించాయి. ఈ ప్రత్యామ్నాయ వ్యూహంలో భారత్ మొదటి వరుసలో ఉన్నది. ఆపిల్, శామ్‌సంగ్ వంటి సంస్థలు తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు తరలిస్తున్నాయి. ఇది మన పారిశ్రామిక భవిష్యత్తును మార్చబోయే మహా విప్లవం. మన దేశంలో జరుగుతున్న డిజిటల్ మార్పులు అమోఘం. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశం మనది. సెమీకండక్టర్ల తయారీలో మనం వేస్తున్న అడుగులు భవిష్యత్తులో మనల్ని గ్లోబల్ లీడర్‌గా నిలబెడతాయి. ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న నిర్మాణం. ఈ దశాబ్దం (2020–2030) భారతదేశానిది. అమెరికా–చైనా మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు మనకు ఒక సువర్ణావకాశం. భవిష్యత్తులో భారత్ కేవలం ఒక మార్కెట్‌గానే కాకుండా, ప్రపంచానికి కావాల్సిన ఉత్పత్తులను అందించే కర్మాగారంగా మారుతుంది. చివరగా ఒక మాట. అవకాశం ఎప్పుడూ తలుపు తట్టదు, అది మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఇప్పుడు ప్రపంచంలో నెలకొన్న అశాంతి, అనిశ్చితి మన దేశానికి ఒక మారువేషంలో వచ్చిన అదృష్టం. గతాన్ని గర్వంగా చెప్పుకోవడమే కాదు, భవిష్యత్తును మనమే నిర్మించుకోవాలి. మన విధానాలు, దౌత్య సంబంధాలు మరింత పటిష్టం కావాలి. పేదరికాన్ని రూపుమాపడానికి, నిరుద్యోగ రక్కసిని తరిమికొట్టడానికి ఇదే సరైన సమయం. ఇది మనకు లభించిన 'ఇప్పుడే.. లేదా ఎప్పటికీ కాదు' అనే కీలకమైన సందర్భం. ఈ అవకాశాన్ని ఒడిసి పట్టుకుంటే, భారతదేశం మళ్లీ ప్రపంచ వేదికపై అగ్రపీఠాన్ని అలంకరించడం ఖాయం.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143